

# అదిప్రశ్న - ఏదిజవాబు?

-రమణమూర్తి

**గమనిక**

(ప్రముఖులైన క్రికెట్ ఆటగాళ్ళ పేర్లు వాడుకొన్నా అది కేవలం కథ మాత్రమే.)

స్కోరు బోర్డు వెక్కిరిస్తోంది— 10—3—0.

ఆ ఉదయం పదకొండు గంటలకు భారత జాతి పరువు ప్రతిష్ఠలు పాతాళానికి దిగజారాయి. దిగజారక ఏం చేస్తాయి? భారత జట్టులోని మేటి యోధులు ముగ్గురు అరగంటలో పది పరుగులకే 'బేక్ ఇన్ ది పెవిలియన్'. పాత కథే. ప్చ్! మన వాళ్లకు క్రికెటేమిటని పండితులు పెదవి విరిచారు.

లాల్‌బహదూర్ స్టేడియమ్‌లో పంకుల సమరం సాగుతూంది. బేటుకు బంతికి మధ్య, ఇద్దరు కెప్టెన్ల ఎత్తుపై ఎత్తుల మధ్య, రెండు జట్లకు మధ్య నిబంధనల ప్రకారం అయిదు రోజుల యుద్ధం. ఇరవై వేల మంది ప్రేక్షకులు దిగ్భ్రాంతులై ఆటను చూస్తున్నారు. లక్షలాది శబ్ద ప్రేక్షకులు దేశమంతటా రేడియోను ట్యూన్ చేసుకొని ఊపిరి బిగించి ఆ యుద్ధాన్ని వింటూ చూస్తున్నారు. మా జట్టు ఓడితే మా జాతి గౌరవం పోతుందనే దృక్పథాన్ని పట్టన్ ఆటకు అందించినప్పటి నుండి, ఆటలోని సరదా మృగ్యమైంది. సరదాగా ఆడుకుందామనే ఆటగాళ్లకు, అంతకన్న సరదాగా ఆటను చూసి ఆనందిద్దామనుకొన్న ప్రేక్షకులకు క్రికెటు ఫీల్డు రణరంగం, క్రికెటు టెస్టు చిన్న సైజు యుద్ధం. ఓడిపోయినవారిని, బాగా ఆడనివారిని పత్రికలు దుయ్యబడతాయి. ధైర్య సాహసాలతో ఆడిన వారిని తారాపథానికి ఎత్తుతాయి. ఆ అంటు వ్యాధి ప్రేక్షకులకు, శ్రోతలకు కూడా పట్టుకొంటుంది. పన్నెండేళ్ల క్రితం — భారత జట్టు వెస్టిండీస్ చేతిలో చావు దెబ్బలు తింటున్న రోజులు. జాతి పరాజయ పరంపరకు నిరసనగా గాజులు, పసుపు, కుంకుమ భారత కెప్టెనుకు వనితాలోకం చేత పార్సెలు చేయబడ్డాయి!

అవరలో ఆడుకొని బొంబాయి టెస్టును రక్షించిన అలీ బేగ్ అదృష్టవంతుడు. ఆత్మాభిమానంతో అతనిని బుగ్గ మీద ముద్దు పెట్టుకొని బహూకరించిం దొక మగువ!

"మీరు నెగ్గారా, మీరు మా హీరోలు. ఓడారా, మీరు చవటలు." ఈ భావం ప్రచ్ఛన్నంగా, బాహాటంగా కూడా ప్రేక్షకుల చేత ప్రదర్శించబడుతుంది.

మూడు వందల నిమిషాలు.

ఇంకా కావలసినవి 242 పరుగులు.

ఉన్నవి ఏడు వికెట్లు.

ఆస్ట్రేలియా కెప్టెను లారీ లెక్కించాడు.

బౌలర్ మెకెంజీ కూడా లెక్కిస్తున్నాడు. తరవాత బంతికి కూడా వికెటు వస్తే, హేట్‌ట్రిక్కుతో మూడు వందల టెస్టు వికెట్లు. మరొక మైలురాయి.

మూగపోయిన కామెంటేటర్ల గొంతులు కర్తవ్య పాలనలో విధిలేక పని చేస్తున్నాయి — మెకెంజీ ఘన కార్యాలను వర్ణిస్తూ.

"పర్లీ, పర్లీ, ఐస్‌క్రీమ్, ఐస్‌క్రీమ్" అనే కేకలు కూడా ఆగిపోయాయి. వాతావరణంలోని నిస్తబ్ధత అమ్మకపు కుర్రవాళ్లను కూడా ఆవహించినట్లుంది.


ఇరవై వేల మంది ప్రేక్షకులు చేష్టలుడిగి నిర్జీవ ప్రతిమలైనారు.

డ్రెస్సింగ్ రూములో కెప్టెను పటౌడి యాంత్రికంగా రుమాలుతో మొహం తుడుచుకొన్నాడు.

బేటింగ్ ఆర్డరు మార్చాడు.

"రాజా, పేడప్. ప్లీజ్ స్టే దేర్." కెప్టెను ఆదేశం.

రాజా పెవిలియను మెట్లు దిగాడు. ఆలోచనలు తేనెటీగల వలె ముసురుకొంటున్నవి. అంతర విశ్వ విద్యాలయ క్రికెట్ పోటీలలో కొత్త బేటింగు రికార్డును స్థాపించిన తను టెస్టు కేపు కొరకు ఆరు సంవత్సరాలు ఆగవలసి వచ్చింది. మొదటి ఇన్నింగ్సులో ఏమీ పరుగులు చెయ్యలేదు. అప్పుడూ ఇప్పుడూ కూడా నరాలు స్వాధీనంలో లేవు. ఇది తన మొదటి టెస్టు. ఫెయిలయితే ఆఖరి టెస్టు కూడా.




నూతన దంపతుల జంట గేలరీలో నుండి రాజా వైఖరిని ఆసక్తితో చూస్తూంది. ఈ విపత్కర సమయంలో తానే వెళ్ళి సెంచరీ కొడితే ఎలాగుంటుందో నని పగటి కలలు కంటున్నాడు భర్త. ఆమెకు కూడా అట్టి ఆలోచనే వచ్చింది. మొగుడు ఈ సమయంలో భారత జట్టు నాదుకొంటే రేపటి పేపర్లలో అతని పేరు ఎంత పెద్ద అక్షరాలలో పడుతుందోనని ఊహిస్తూంది. ఆలోచనలను ఆపి పక్కకు తిరిగి భర్తను ఓరకంటితో చూసింది. అతడు తదేక ధ్యానంతో వేరుశెనగ పలుకులతో సెంచరీ కొడుతున్నాడు. ఇది సెంచరీ కొట్టే మొహం కాదని మనస్సులోనే నిట్టూర్చింది ఇల్లాలు.

రజని రాజాపై బైనాక్యులర్లు ఫోకస్ చేసింది.

'ఈ రోజు రాజా మొహం ఇలాగుందేమిటి కళా విహీనంగా? ఈ టెస్టు గురించి ఎన్ని కలలు గన్నాడు! మళ్లీ ఫెయిలవుతాడా?' రజని ఆలోచిస్తూంది.

"లెగ్ ఎండ్ మిడిల్ ప్లీజ్." గార్డు తీసుకొని, ఫీల్డు నంతటిని కలయ జూశాడు రాజా. చుట్టూ వర్తులాకారంలో పది మంది ఫీల్డర్లు. ఆస్ట్రేలియన్ డెత్ రింగ్.

మళ్లా తేనెటీగలు.

ఇరవై రెండు గజాల క్రికెట్ పిచ్ ఒక గజం పొడవు ఉన్నట్లుంది. మైదానం యోజనాల విస్తీర్ణం! చేతిలోని బేటు చిన్న కర్రముక్కలా గుంది. ఈ కర్రముక్కతో ఆడడ మెలాగ? ఆస్ట్రేలియా జట్టు పదకొండుమంది, ఇద్దరు అంపైర్లు, వేలాది ప్రేక్షకులు — అంతా తనకు శత్రువులు. ఈ శత్రుకూటం మధ్య ఎక్కడో ఉంటుంది రజని. ఓవర్లో ఇంకా రెండు బంతులు. తాను మొదటి బంతికి అవుటయితే మెకెంజీకి హేట్ ట్రిక్కుతో మూడు వందల టెస్టు వికెట్లు. ఖర్మ! మెకెంజీ ఘోర రాక్షసుడు. వికెటు కీపరుతో సహా పది మందిని చుట్టూ వలయాకారంలో ఉంచిన చేపల్ మరొక ఘోర రాక్షసుడు.

ఈ క్రికెటు, ఈ టెస్టు—ఇవన్నీ వదిలిపేసి ఎక్కడికయినా పారిపోదామనిపించింది రాజాకు.

"ప్లే దేర్!" కెప్టెను ఆదేశం.

మెకెంజీ తిరిగాడు. పరుగును ప్రారంభించాడు.

ఆలోచనలు ఆగిపోయాయి. సర్వమూ మరిచాడు రాజా. ఆ క్షణంలో అతనికి కనిపించేది బౌలరు చెయ్యి మాత్రమే.

ఆఫ్ స్టంపుకు ఆవల ఔట్ స్వింగరు. బంతి చాలా వేగంగా వచ్చింది. అప్పుడు నాడు అదే ధర్మ సందేహంతో బేటును యాంత్రికంగా ముందుకు పెట్టాడు. అంచుకు తగిలి రెండు స్లిప్పుల మధ్య నుండి బంతి బౌండరీని చేరింది.

ఛ! ఛ! తన పొరపాటుకు తిట్టుకున్నాడు రాజా.

లక్కీ ఫోర్.

మెకెంజీకి హేట్ ట్రిక్కు రాలేదు.

తరువాయి తొంభై నిమిషాలు రాజా క్రికెటు చరిత్రలో గర్వింపదగ్గవి కావు. ముందుకు ఆడాడు. వెనకకు ఆడాడు. ఏ విధంగా ఆడినప్పటికీ బేటుకు,బంతికీసంపర్కమయినదేతక్కువ. అయినప్పుడు ఏ అంచుకో తగిలి ఆశగా కాచుకొన్న ఫీల్డర్ల చేతులకు దూరంగా పడేది బంతి. బేట్స్‌మన్ బలహీనతను కనిపెట్టిన బౌలర్లు బంపర్ల యుద్ధం ప్రారంభించారు. యుద్ధ సమయంలో కర్ణుని విద్యవలె, రాజా హుక్ షాటు సంగతే మరిచి బంపర్లకు తల వంచడం మొదలుపెట్టాడు. ఒళ్లు హూనమయింది. కాని, అదృష్టం బాగుండి ఔటు కాలేదు.

పదమూడులో ఉన్నప్పుడు ఆ స్కోరును దాటడానికి అతడు పడిన యాతన వర్ణనాతీతం.

ఇతనికి టెస్టు టెంపర్‌మెంటు లేదనుకున్నాడు సెలక్షన్ కమిటీ మెంబరు మర్చెంటు.

క్షణ క్షణ గండములలో బతుకుతున్న రాజాను చూసి కంపర మెత్తింది కెప్టెనుకు.

బౌలర్లు అతని అదృష్టాన్ని, తమ దురదృష్టాన్ని నిందించుకొన్నారు.

తన మొదటి సారి ఇంగ్లాండు టూరులోని ఇటువంటి యాతనే గుర్తుకు వచ్చింది లారీకి.

"రాజా! వాటీజ్ రాంగ్ విత్ యు టుడే" అని రజని ప్రేక్షకులలో వాపోతూంది.

ఆత్మ విశ్వాసం లోపించి ఒక పక్క రాజా. ఆత్మ విశ్వాసం ఎక్కువై రెండవ పక్క ఇంజనీరు తన మామూలు ధోరణిలో చావు బ్రతుకుల మధ్య జీవిస్తూ ఆడుతున్నాడు. ఇంజనీరు ఆటలో మొదట్లో గౌరవం కోల్పోయిన స్కోరు బోర్డు కాస్త గౌరవం సంపాదించుకొంది.

పన్నెండు గంటల ఇరవై అయిదు నిమిషాలు.

స్కోరు మూడు వికెట్లకు 70 పరుగులు.

ఆఖరి ఓవరులో ఆఖరి బంతి.

కాట్ టు ఇంజనీర్.

మిడిల్ స్టంపుపై యార్కరు.

ఫుల్‌టాసుగా మార్చి కొట్టేశ ననుకున్నాడు ఇంజనీరు.

వెళ్లింది బంతికాదు. వికెట్టు.

70—4—49.

నలభై తొమ్మిది పరుగులకు హర్షధ్వానాల మధ్య ఔటయాడు ఇంజనీరు.

ఆ ఒక్క బంతిని జాగ్రత్తగా ఆడితే ఏ సొమ్ము పోయిందనుకున్నాడు పదిహేను పరుగులతో ఔటు కాని రాజా.

లంచి విరామ సమయం.

విరామ సమయంలో ఏ వింత శక్తి అతనిపై పని చేసిందో, తరవాత అతని ఆట పూర్తిగా మారింది. బేటు అంచులకు తగిలి వెళ్లే బంతులిప్పుడు లేవు. ప్రతి బంతి బేటు మధ్యలో తగిలేది. సుపరిచితమైన ఆ శబ్దం అతని చెవులలో శ్రవణానందంగా వినిపించేది. ఫుల్‌టాసులను, హాఫ్ వాలీలను డెడ్ బేటుతో ఆపే ప్రయత్నం లేదు. వాటికి కావలసిన సత్కారమే లభించింది. మూర్తీభవించిన ఆత్మ విశ్వాసంతోను, లాఘవంతోను ఆడుతున్న రాజా బేటునుండి వచ్చినవన్నీ కాపీబుక్ షాట్లే. అతని చేతిలోనిది మంత్రదండ మేమో ననిపించింది. కరచాలన దూరంలో ఉన్న ఫీల్డర్లు బౌండరీ అంచులపై సర్దుకొన్నారు.

'దట్ బోయ్ హేజ్ టేలెంట్.' మర్చెంటు స్వగతం.

'గుడ్ గోయింగ్, రాజా!' రజని స్వగతం.

"స్లీక్ ట్యూన్ రౌన్ యువర్ ట్రౌజర్స్!"

కామెంటేటరు అభ్యర్థన.

రెండవ వైపున స్పిన్నరు అతి సామర్థ్యంతో తన వికెటును కాపాడుకొంటూ స్కోరింగును రాజాకే వదిలేశాడు.

అరవై నిమిషాలలో ఏభై పరుగులు. లారీ బౌలర్ల నందరిని మార్చి చూశాడు. ఫలితం లేకపోయింది.

మగువ మనస్సు, వాతావరణం వైఖరి, క్రికెటులో ఫలితం చెప్పలేమన్నారు అనుభవజ్ఞులు.

(తరువాయి 38 వ పేజీలో)

# అది ప్రశ్న...

( 35 వ పేజీ తరువాయి )

పరిస్థితి కాస్త మెరుగయిందనే సమయానికి ఆవకూడని బంతికి పటౌడీ అవుటయాడు.

120—5—12.

వంభై తొమ్మిదిలో ఉన్న రాజా ముడుచుకొన్నాడు.

పరుసగా ఏడు మెయిడన్లు.

దూరంగా ఉన్న ఫీల్డర్లందరు దగ్గరకు వచ్చారు.

స్కోరు 120 వద్ద స్తంభించింది.

బోరనుకున్నారు ప్రేక్షకులు.

గ్లివన్ టు జయసింహ.

మొదటి రెండు బంతులకు పరుగులు లేవు. అకస్మాత్తుగా వెర్రెత్తినట్లు విజృంభించాడు జయసింహ. నాలుగు బౌండరీలు.

అదొక అంటు వ్యాధి. రెండవ వైపున ఎత్తిన శివంలో కొంతభాగం రాజాకు కూడా సంక్రమించింది.

సిట్ స్క్వేర్ కట్‌తో ఏభై దాటాడు.

'ధాం!' ప్రేకరు పేలింది.

రజని తృప్తిగా ఊపిరి పీల్చింది.

ఆ ఓవర్లోనే ఒక లేట్ కట్, ఒక ఆఫ్ డ్రైవుతో రాజా అరవైలలోకి వెళ్ళాడు.

ఆట వేగం పుంజుకొంది.

కాని, మళ్ళా మామూలు కథే. టీ విరామ సమయానికి ఇంకొక ఇరవై పరుగులు కలిశాయి. జయసింహ, సురతి కూడా అవుటయారు. మిగిలిన ముగ్గురు బౌలర్లు ఎంతసేపు నిలబడగలరు? ఇంకా తొంభై నిమిషాల ఆట ఉంది. అవసరమయితే కొత్త బంతిని తీసుకొని మెకెంజీకి ఇస్తే, పై పని అతనే చేస్తాడు. మేచి జేబులో పడినట్లే భావించాడు లారీ. ఆస్ట్రేలియాకు, గెలుపుకి మధ్య మిగిలినవాడు రాజా — అరవై అయిదు పరుగులతో అవుటు కాని రాజా.

నాలుగు గంటల పది నిమిషాలు.

ఉన్నవి ఏభై నిమిషాలు, రెండు వికెట్లు.

గెలుపుకి కావలసినవి ఏభై పరుగులు.

కొత్త బంతిని తీసుకొన్నాడు లారీ.

ఆ ఓవర్లో ప్రసన్న మెకెంజీ కెదురుగా ఇంకా అయిదు బంతులనాడాలి.

రెండవ వైపున ఎనభై అయిదు పరుగులతో ఆడుతున్న రాజా విందులు తొక్కుతున్నాడు — ఈ ఓవర్లోనే రెండు వికెట్లు పడిపోతే? సెంచరీకి ఇంకా పదిహేను పరుగులు కావాలి.

ఛీ! సెంచరీ కాదు ముఖ్యం, గెలుపు.

ఈ గంభీర వాతావరణం లోనికి కుక్కపిల్లాటి ప్రవేశించింది. దాని వెంట పోలీసులు. ప్రేక్షకుల నుండి ఈలలు, గోల.

క్షణాల్లో కుక్కను బయటకు తోలేశారు.

ప్రసన్న, రాజా గుసగుసలాడుకున్నారు.

ప్రసన్న అయిదు బంతులను అవలీలగా ఆడాడు.

రాజా కానలీని ఎదుర్కొనడానికి సిద్ధమయ్యాడు.

ఇప్పటికే రాజా బేటింగులో అత్యున్నత స్థాయికి ఎదిగాడు. రెండవ బేట్స్‌మన్‌ను బౌలర్ల పాల పడకుండా రక్షించడం, స్కోరును నడపడం, ఆఖరి బంతికి ఎలాగో అలాగ ఒక పరుగుతో రెండవ వైపు చేరడం — ఈ రకమైన ఆటతో ఆట రక్తి కట్టింది. అతని పాదాల నృత్యం, బేటు నుండి ధారావాహినిగా ప్రవహించే పరుగులు...ఆటకు ముగ్ధులయారు ప్రేక్షకులు.

స్కోరు బోర్డు 216 చూపిస్తోంది.

రాజా స్కోరు 99.

'నెర్వస్ నైంటీస్. ఏం చేస్తాడో?' పటౌడీ.

'ఒక్క రన్, రాజా. జస్ట్ వన్ మోర్. మేచి పోయినా ఫరవాలేదు.' రజని కూడా ముళ్ళమీదే ఉంది.

బంతిని పాయింటుకు పక్కగా కట్ చేశాడు.

"కమాన్!" ప్రసన్న అరుపు.

తెలియకుండానే ఆఘమేఘాలమీద పరుగెత్తాడు.

నిజం రుచి ఇష్టాయిష్టాల మీద ఆధారపడి ఉంటుంది. అందుకే నిజం చేదుగా ఉంటుందనడం. మనిషికి కొన్ని అభిరుచులూ, ఇష్టాలూ అనేక కారణాలవల్ల ఏర్పడతాయి. ఆ ఇష్టాల మత్తులో ఇతరం అన్నీ కనిపించదు. తాత్కాలికమైన నిర్ణయాలు వ్యక్తిపై స్వారీ చేయిస్తాయి. అలసిన ఆలోచనలు వదిలిన మత్తులోంచి బయలుదేరితే, అప్పుడు...

---

"దట్స్ హిజ్ సెంచరీ. ఎ గ్రాండ్ నాక్!" కామెంటేటరు గొంతుక ఉత్సాహంతో గోల పెట్టింది.

"ధాం! ధాం! ధాం!" అని గేలరీలో నుండి టపాకాయలు పేలాయి.


వంభై వేల చేతులు ఆనందోత్సాహంతో ఊగాయి. లారీతో సహా ఆస్ట్రేలియా జట్టు, ప్రసన్న అభినందనలు చెప్పారు.

ఆ క్షణంలోనే రజని అతనికి తన మనస్సు నంకితం చేసింది.

"దటీజ్ ఎ ఫూలిష్ సింగిల్!" మర్చెంటు.

కోలాహలం తగ్గింది.

యుద్ధం తిరిగి ప్రారంభమయింది.




అప్పటికి తెలుసుకొన్నాడు రాజా తన పొరపాటు. ఓవరులో ఇంకా నాలుగు బంతు లున్నాయి. వాటిని ప్రసన్న ఎదుర్కోవాలి.

ఆఖరి బంతి. ప్రసన్న క్లీన్ బౌల్డ్.

217—9—0.

ఆ ఒక్క పరుగు తీసుకోకూడదు. పొరపాటు. ఘోరమైన పొరపాటు. తిట్టుకొన్నాడు రాజా.

• • •

నాలుగు నిమిషాల వ్యవధి.

స్కోరు బోర్డు 244 పరుగులు చూపిస్తోంది.

రాజా 122 పరుగులతో ఆఖరి ఓవరు ఆడడానికి సిద్ధమయ్యాడు.

నాలుగు నిమిషాలు.

ఒక వికెటు.

ఎనిమిది పరుగులు.

కొత్త గార్డును తీసుకొన్నాడు.

తన నైపుణ్యాన్ని మొదటి బంతిలో పెట్టి ఎంతో స్పీడుగా బౌలు చేశాడు మెకెంజీ. ఆఫ్ స్టంపుకి బాగా దూరంలో పడిన ఔట్ స్వింగరది. బేట్స్‌మనును, వికెట్ కీపరును, ఫీల్డర్లను అందరిని దగాచేసి బంతి బౌండరీ చేరింది.

ఎనిమిదిలో నాలుగు పోయినవి.

డ్రాకు ఆడడమా, గెలుపుని ఆడడమా అనే ధర్మ సంకటంలో పడ్డ రాజాకు సందేహం తొలగిపోయింది. మిగిలినవి అయిదు బంతులు. కావలసినవి నాలుగు పరుగులు. కొట్టెయ్యాలి.

మెకెంజీ ఫీల్డును తిరిగి సర్దాడు.

మూడు బంతు లయిపోయాయి. పరుగులు లేవు.

అయిదవది వచ్చింది. ఫుల్‌టాసు. ధర్మం.

బంతి బౌండరీని వెతుక్కొంటూ పరుగులెత్తింది.

గెలుపును వెతుక్కొంటూ పరుగెత్తారిద్దరూ.

గోల. గోల. గోల.

ఎక్కడినుండి పరుగెత్తాడో, ఎలాగ ఆపాడో ఎవరికీ తెలియదు. షియన్ బంతిని బౌండరీపై ఆపాడు.

నేరుగా వికెటు కీపరు చేతిలో పడింది.

నాలుగు పరుగు లనుకున్న రాజాకు మూడే దక్కాయి.

స్కోర్ లెవెల్.

నోట్లో అన్నం లాగుకొన్నట్లయింది.

లాస్ట్ బాల్.

ఆడవలసినది బేడీ.

మేచి పోతుందనే బాధ లేదు ఇండియాకు.

బేడీ, రాజు గుసగుసలు.

మెకెంజీ ఫీల్డును తిరిగి సర్దాడు.

ఆఖరి బంతి.

"గుడ్ లెంగ్త్ బాల్. వెరీ గుడ్ ల్ ఆన్ ది మిడిల్ స్టంప్. బేడీ మ్యా ఇంగ్ ఎబౌటిట్. క్లీన్ బౌల్డ్!"

జని కామెంటరీ వింటూంది.

బ్రె. బ్రిస్బేన్ టెస్టు తరవాత బ్రె. రాజా 125 నాటౌట్.

మేచి డ్రా అయింది.

రాజాకు బ్రహ్మరథం పట్టారు.

• • •

రాత్రి పది గంట అయింది. బరువు బాధ్యతలకు దూరంగా తేలికపడిన మనస్సుతో నిశీథిలోని ప్రశాంతతను ఆస్వాదిస్తూ రాజా హుసేన్‌సాగరు నీళ్లలోకి చూస్తున్నాడు. రజని దగ్గరలో కూర్చుంది.

"పోదాం పద, రజనీ, ఒళ్లంతా నొప్పిగా ఉంది. రెస్టు తీసుకోవాలి."

"కొంచెంసేపు కూచుందాము, రాజా. మనస్సు హాయిగా ఉంది నా కిప్పుడు ... కంగ్రాట్స్, రాజా!"

"ఎన్నిసార్లు చెపుతావు, రజనీ!"

"ఎన్నిసార్లు చెప్పినా, చెప్పాలనే ఉంది. ఈ రోజు, ఈ వారం, ఈ సంవత్సరం, క్రికెటు ఆడినన్నాళ్లు నీ పేరే ప్రతిధ్వనిస్తుంది."

ప్రశంసలకు విముఖత్వం చూపుతున్నట్లు రాజా మొహం పక్కకు తిప్పుకొన్నాడు.

మౌనం కొన్ని క్షణాలు రాజ్యం చేసింది.

"ఏమయినా మాట్లాడు, రాజా. ఇంత గొప్ప హీరో ఇలా మూగనోము పట్టడం బాగులేదు. నీ సెంచరీ ..."

వాక్యం మధ్యలోనే త్రుంచివేయబడింది.

"ఈ రోజు నా అదృష్టం బాగుంది. అంతే. ఇంతకి ముందు నేను ఏ బంతికయినా అవుటు కావలసిన వాడినే. అదే అయితే కథ వేరొక విధంగా ఉండేది. ఇంక పోదామా?"

"రాజా, నిన్ను బలవంతంగా ఇక్కడికి తీసుకొని వచ్చింది నీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలని. మనం ఎన్నేళ్ల బట్టి స్నేహితులమో గుర్తుందా? ఏడేళ్లు దాటింది."

రజని గొంతు మారింది.

ఆమె గొంతులోని మార్పుకి ఆశ్చర్యపోతూ రాజా తల ఎత్తి చూశాడు.

"ఈ గడిచిన ఏడేళ్లలోను నా కెప్పుడూ ఇటువంటి ఆలోచన వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఈవేళ నా కర్థమయింది ... నిన్ను నేను ప్రేమిస్తున్నానని. మనం పెళ్లిచేసుకొందాం, రాజా!" ప్రేమగా అతని చేతిపై చెయ్యి వేసింది—

ఎడం చేత్తో రాయిని తీసి మౌనంగా నీళ్లలోనికి విసిరాడు.

"నిజం, రాజా. మనం పెళ్లి చేసుకుందాం."

ఆరుగురు ఆస్ట్రేలియా బౌలర్లు రోజులో చెయ్యలేని పనిని ఒక్క సెకెండులో ఆమె చేసింది.

రాజా క్లీన్ బౌల్డ్.

"వద్దు, రజనీ. అలాంటి మాటలు వద్దు. నేను ఆ విధా భావంతో ఎన్నడూ చూడలేదు. మన స్నేహాన్ని ఇలాగే ఉండనీ. అసలు నాకు వివాహంపై ధ్యాసే లేదు. నే నెప్పుడో క్రికెటుకు అంకితమై పోయాను. ఇంకా తొమ్మిది, పదేళ్లు క్రికెటు ఆడగలననే నమ్మకం నాకుంది. అదే నా అభిలాష కూడా. ఆ తరవాతనే వివాహం. నీ ఆలోచనలకు, నా ఆలోచనలకు మధ్య చాలా దూరం ఉంది. నీకు తెలియదేమో — డెన్నిస్ కాంప్టనని ప్రఖ్యాత క్రికెటు ఆటగాడున్నాడులే. అతడు సంవత్సరం పొడవునా ఆటలో మునిగి ప్రపంచమంతా పర్యటిస్తుంటే విసుగెత్తిన అతని భార్యలు విడాకులిచ్చారట. ఒకరు కాదు, ఇద్దరు కాదు. ముగ్గురు. అయినా ఏడేళ్లలో ఎన్నడూ లేనిది ఈవేళ ఇలా మొదలు పెట్టావేం?"

బాధగా అన్నాడు రాజా.

"లేదు, రాజా. నువ్వు నన్ను నమ్ము. గతంలో నా కిలాంటి అభిప్రాయం లేకపోయినా, ఈ రోజు నన్ను నేను తెలుసుకున్నాను. ప్రమాణం చేసి చెపుతాను— నా వలన నీ క్రికెటుకు ఎటువంటి ఆటంకం ఉండబోదని."

"ఏమిటి తెలుసుకున్నావు, రజనీ, ఈ రోజు?"

"నేను నిన్ను ప్రేమిస్తున్నానని."

"ఈ రోజే తెలుసుకున్నావు గదూ?"

"అవును."

"ఏ క్షణంలో?"

"నువ్వు సెంచరీ కొట్టిన క్షణంలో."

"రజనీ! నువ్వు ప్రేమని మభ్య పెట్టు కొంటున్న నీ మనస్సు సంగతి చెపుతాను, విను. నీ మనస్సుకు కష్టం కలిగించినా, నిజం చెప్పడమే మంచిది. నిజం చేదుగానే ఉంటుంది. నువ్వు ప్రేమిస్తున్నా ననుకొనేది ఏడేళ్లబట్టి నువ్వు ఎరిగి ఉన్న రాజాను కాదు. ఈవేళ సెంచరీ కొట్టి అకస్మాత్తుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్న రాజాను కూడా కాదు. నువ్వు ప్రేమించేది నన్ను కాదు, నా సెంచరీని."

"ఎంత దారుణంగా మాట్లాడుతున్నావు, రాజా!"

"నిజం ఎప్పుడూ రుచిగా ఉండదు, రజనీ. ఆ వాతావరణం, ఆ ప్రేక్షకులు, ఆ కోలాహలం అటువంటివి. నిన్ను నువ్వు మభ్యపెట్టుకోకు. నేను సూటిగా అడిగే ప్రశ్నకు జవాబు చెప్పు.

"నేను ఈ రోజు టెస్టులో సెంచరీ కొట్టాను. ప్రేమిస్తున్నా నన్నావు. ఒప్పుకుందాం. కాని, ఇదే నా ఆఖరి సెంచరీ కావచ్చు. నేను భవిష్యత్తులో టెస్టులలో రాణించక పోవచ్చు. అప్పుడు కూడా నువ్వు నన్ను ప్రేమిస్తున్నానని అనగలవా? ఈ రోజు నేను సెంచరీ కొట్టాను. ఇలాగే గతంలో దీపక్ శోధన్, కృపాల్‌సింగ్ కొట్టారు. తరవాత క్రికెటులో నామరూపాలు లేకుండాపోయారు. నాకూ అదే గతి పట్టవచ్చు.

"నీకు కలిగినది వాతావరణం మత్తులోని భ్రమ. మత్తు విడిపోతే కల చెదిరి పోతుంది. జీవితాలను క్షణికమైన దౌర్బల్యానికి గురిచేసి, దానికి పెద్ద పెద్ద పేర్లను పెట్టి మనస్సును మోసం చేసుకొనేవారంటే నాకు ఏవగింపు. నువ్వు తీరికగా ఆలోచించుకో. ఈ రోజు హడావిడి, మత్తు, రేపటి పేపర్లలో నా ప్రశంసలు — అన్నీ మరిచి పోయిన తరవాత నేను సెంచరీలు కొట్టలేని స్థితిలో, టెస్టు ప్లేయర్‌గా రాణించని స్థితిలో కూడా నువ్వు నన్ను ఈ రోజు లాగే ప్రేమించగలవేమో నీ అంతరాత్మను ప్రశ్నించుకో. కటువుగా మాట్లాడాను. క్షమించు.

"పద, పోదాం" అంటూ కారు తలుపులు తెరిచాడు రాజా. ✱



మారని రోజులు

చిత్రం—ఎస్. కె. నరసింహారెడ్డి (సికిందరాబాదు–3)